# వందనా.. వందనం

-డా॥ మంతెన సూర్యనారాయణరాజు

నాలుగు రోడ్ల కూడలి. వాహనాల రణగొణ ధ్వని. రెడ్ సిగ్నల్ పడ్డ కొద్దిసేపు వాహనాలు ఆగి, మళ్లీ బయలుదేరుతున్నాయి. సంస్కారం లేని చింపిరి జుట్టు. లోతుకు పోయిన బుగ్గలు. బక్కచిక్కిన ఒళ్లు. ఆ ఒంటికి ఆచ్ఛాదనగా మాసిపోయి చిరుగులు పడ్డ చీరె. చిరుగులను కప్పిపుచ్చలేక విఫలమౌతున్న మాసికలు. చేతిలో పాలిపోయిన ఓ బిడ్డ. ఆ బిడ్డను చంకనేసుకుని వచ్చేపోయే వాహనాలు ఆగగానే, అడ్డంగా వెళ్ళి డబ్బులు అడుక్కుంటుందా బిచ్చగత్తె. దయగలవారు ఏదో చేతికొచ్చింది ఇస్తున్నారు. సమయం పది గంటలు కావస్తూండగా ట్రాఫిక్ కానిస్టేబుల్ వచ్చి సెంటర్లో నిలబడ్డాడు. అతగాణ్ణి చూడగానే ఆమె భయపడింది. వాడి కంటబడితే చేతిలోని చిల్లర నిర్దాక్షిణ్యంగా లాక్కుపోతాడని ఆమెకు తెలుసు. అందుకే చిల్లర లెక్క చూసుకుంది. రెండున్నర రూపాయలు ఉంది. పేగులు ఆకలితో చుట్టుకుపోతున్నాయి. చంకనున్న బిడ్డ తల్లిపాలు రాక రొమ్ము తడుముతూ అవస్థ పడుతోంది. ఉన్న డబ్బుతో సింగిల్ టీ అన్నా తాగుదామని దూరంగా ఉన్న డిక్కీ హోటల్ దగ్గరకు వెళ్ళింది.

చేతిలో చిల్లర టీకొట్టు వాడికి ఇచ్చి "సింగిల్ టీ ఇవ్వండి బాబూ" అంది. వాడు విసుక్కుంటూ ఆ సొమ్ము తీసుకుని లెక్కపెట్టుకుంటూ "పక్కకు నిలబడు. వరేయ్ సింగిల్ టీ పట్రా" అని చెవికోసిన మేకలా అరిచాడు. 'ఇటువంటి ముష్టిముండల్ని చూస్తే మా హోటల్కొచ్చే బేరాలు కూడా పోతాయి' అంటూ గొణుక్కున్నాడు. ఆ పేదతల్లికి అటువంటి తిట్లూ, శాప నార్థాలు, ఛీత్కారాలు, గొణుగుళ్ళూ కొత్తేమీ కాదు. సప్లయర్ సింగిల్ టీ తెచ్చి ఆమెకిచ్చాడు. ఆ గ్లాసులో ఈగ కనిపిస్తే దాన్ని చేత్తో తీసి, తాను కొద్దిగా తాగి, మిగిలింది బిడ్డకి పట్టింది. ఆబగా ఆ పిల్ల గోరువెచ్చని ఉడుకునీళ్ళు చప్పరించిందేకాని, దాని కడుపు నిండ లేదు. అర్థాకలితో ఏడుపు లంకించుకుంది. టీ దుకాణం వాడు వెళ్ళు వెళ్ళు అంటూ ఆమెను కసిరేశాడు.

అలా వెళ్లి పోస్టాఫీసు ముందు నిలబడి మధ్యాహ్నం మూడు గంటల వరకూ యాచించినా ముష్టి మూడు రూపాయలే దొరికాయి. ఆకలికి చంకలో బిడ్డ తట్టుకోలేక ఏడ్చి ఏడ్చి స్వరం తగ్గిపోయింది. దేవాలయానికి దగ్గరలో ఒక మంచినీటి నుయ్యి కనిపించింది. తాను కొన్ని నీళ్ళు తాగి, పిల్లకి కొద్దిగా పడదామని వెళ్ళింది. పిల్లని ప్రక్కనున్న గుడి అరుగు మీద పడుకోబెట్టి ఒక చేదనీళ్ళు తోడి ముఖం కడుక్కుని కాసిన్ని తాను తాగింది. రెండో చేద తోడి బిడ్డను తీసుకొచ్చి దానిచేత కొన్ని నీళ్ళు తాగించింది. కొద్దిసేపు తల్లీ బిడ్డ గుడి అరుగుమీద సేదదీర్చుకున్నారు. పొద్దుట్నుంచీ కడుపులో ఏమీ లేకపోవడంతో ఆమెకు పసికందును ఎత్తుకుని నిలబడే శక్తి కూడా లేకుండా పోయింది. ఆకలితో బిడ్డ ఒకటే ఏడుపు. దాని పరిస్థితి దయనీయంగా తయారయింది. పూజారి బయటికొచ్చి గుడి తలుపులు వెయ్యబోతూ ఆమెను చూశాడు. "పిల్ల అలా ఏడ్చి అఘోరిస్తుంటే పాలు పట్టరాదూ! ఏవిటా పరధ్యాన్నం" అంటూ కేకలేశాడు.

చేతులెత్తి ఆ అర్చకుడికి మొక్కుతూ ఆమె "పూజారయ్యా! పొద్దుట్నుంచి ఏమీ తినలేదు. బిడ్డకు పాలిద్దామంటే పాలు లేవు. చేతిలో మూడు రూపాయలు ఉన్నాయి. ఇంత ప్రసాదం మిగిలితే అదైనా పెట్టి పుణ్యం కట్టుకోండి" అంటూ ఆర్ద్రంగా అడిగింది. అతనికి పరిస్థితి అర్థమై లోనికెళ్ళి రెండు కొబ్బరి చెక్కలు తీసుకొచ్చి ఆమెకిచ్చాడు. "నీ ఆకలి, నీ బిడ్డ ఆకలీ తీర్చే స్థోమత నాకు లేదు. నా దగ్గర మాత్రం ఏముంటుంది వెర్రిదానా! ఇది శివాలయం. ప్రొద్దున్న వచ్చుంటే అరటిపళ్ళైనా ఇచ్చుండేవాణ్ణి. నేను కాకుండా ఇంట్లో ఐదుగురం ఉన్నాం. పళ్ళెంలో డబ్బులు శాఖ పాకాలకే చాలవు" అని వెళ్ళిపోయాడు.

వెంటనే కొబ్బరిచెక్కలను ముక్కలు కింద కొట్టుకుని తినేసింది. ఒళ్ళోని ఆడబిడ్డ ఆకలితో తల్లి నోటివైపే చూడసాగింది. దాని చూపు విచిత్రంగా అనిపించింది. ముందు నీ కడుపు నింపుకుని నన్ను పస్తులుంచుతున్నావా అన్నట్లున్నాయి.

అల్లంత దూరంలో సినిమా షూటింగ్ జరుగుతుంటే బిడ్డను చంకనేసుకుని అక్కడకు బయల్దేరింది ముష్టితల్లి. చెయ్యి చాచి అడిగితే ఒక్కరూ పైసా విదల్చలేదు.

"ఈ సీన్లో మీరు బీడీ కాల్చాలి" అన్నాడు హీరోతో డైరెక్టర్. యూనిట్‌లో బీడీ కాల్చేవాళ్ళే లేరు. షూటింగ్ చూడటానికి వచ్చిన వాళ్లని బీడీ ఉంటే ఇమ్మని ఎవరో అడిగారు. అంతే, ఇక అతనిమీద బీడీలు, సిగరెట్ల వర్షం కురిసింది.

ఇది చూస్తున్న బిచ్చగత్తె మనసు ఎంతో క్షోభకు గురయింది. తనకు పావలా ముష్టి వెయ్యడానికి ఎవరికీ చేతులు రాలేదు. అర్ధ రూపాయి నుంచి పది రూపాయల విలువ చేసే సిగరెట్లు చేజేతులా పారవేశారు. బీడీలైతే గుట్టలు పడిపోయాయి. అక్కడ హడావుడి తగ్గగానే కిందపడ్డ కొన్ని సిగరెట్లు ఏరి బడ్డీకొట్టు దగ్గరకు వెళ్లింది. "బాబూ ఇవితీసుకుని డబ్బులివ్వు. పిల్ల దానికి పాలు లేవు" అంటూ దయనీయంగా అడిగింది.

కొట్టువాడు ఎగాదిగా చూస్తూ, "కన్నం వేసి తెచ్చావా?" అని అడిగాడు.

లేదన్నట్లు తలాడించింది. ఓ ఐదు రూపాయలు చేతిలోపెట్టి పక్కకు పొమ్మని గెంటేశాడు.

పక్కనున్న బేకరీకెళ్లి ఓ రొట్టె కొని తెచ్చుకుని తింటూ రోడ్డువారగా కూర్చుంది.

రొట్టె పూర్తయ్యేలోపే ఓ లావుపాటి స్త్రీ కారు దిగి వగరుస్తూ బిచ్చగత్తె దగ్గరకు వచ్చి ఆగింది. "నిన్నే నమ్మాయ్, నీ బిడ్డను కాస్సేపు నాకిచ్చేయ్! పావు గంటలో దాన్ని నీకు తిరిగిచ్చేస్తా. కావాలంటే ఇదిగో ఈ వంద ఉంచుకో" అంది ఓ పచ్చనోటు ఆమెకు చూపించి ఊరిస్తూ.

"అమ్మో! సిన్మాలోకైతే నేనివ్వను. తిండి లేకుంటే పస్తులైనా పడుకోబెడ్తా కానీ నా బిడ్డను మీ కివ్వ" అని భీష్మించుకుంది ముష్టితల్లి.

"అబ్బా! నీకెలా చెప్పేదే నా బాధ. ఈ బాధ తట్టుకో లేకుండా ఉన్నా! గుండెలు బరువెక్కి పోతున్నాయి. నిజం చెబితే బిడ్డనిస్తావా! కావాలంటే ఇంకో వంద తీసుకో" అంది.

లావుపాటి స్త్రీ బాధేమిటో చెప్పడంలేదు. క్షణక్షణానికీ బిడ్డ మీద రేటు పెంచేస్తుంది. బిచ్చగత్తెకి ఇదంతా అయోమయంగా అన్పించింది.

"ఎన్నాళ్ళు కష్టపడితే మూడొందలు వస్తాయి. నా మాట విను" అంటూ ప్రాధేయపడసాగిందామె.

బిడ్డతల్లి ఆ! అనలేదు ఊ! అనలేదు. బలహీనమైన బిడ్డని ఆ బక్కతల్లి నుంచి లావుపాటి స్త్రీ బలవంతంగా లాక్కుని, ఐదువందల నోటిచ్చి "ఇది ఉంచుకో! నేను పొద్దుట్నుంచీ మా యజమానురాలి బిడ్డకు పాలివ్వక

## ప్రకృతి ఒడిలో పయనిద్దాం

నగర కాంక్రీటు కట్టడాలలో
బందీ అయిన నాగరిక జీవనం
పోటీ ప్రపంచంతో పోరాడుతూ
లక్ష్య సాధనలో సవాళ్ళ నెదుర్కొంటూ
పెరిగిన ఒత్తిళ్ళతో సతమతమౌతు
ఏదో సాధించాలనే తపనతో
నిర్విరామమెరుగని పరుగు
క్షణం కూడా... ఎక్కడా
ఆగని ఒకటే పరుగు.

ఒక్కసారి... అలా
నా గతంలోకి తొంగిచూస్తె
ఎన్నెన్ని జ్ఞాపకాల అలలో
మదిలో సుడులు తిరుగుతు.
చందమామరావే...
జాబిల్లిరావే... అంటూ
అమ్మ పాడే పాట... వింటూ
గోరుముద్దలు తిన్న / నా బాల్యం.

ఆరుబయట పెరట్లో / అమ్మమ్మ ఒడిలో
కురిసే వెన్నెల ధారల్లో
కథలు వింటూ నిదురించిన
నా చిన్నతనం.

నులివెచ్చని చంద్రకిరణాలు కురిపించే
అమృతంలో తడిసి ముద్దయి
మధురానుభూతులు పంచుకుంటూ
వెన్నెల రాత్రుల్లో విహరించిన / నా యవ్వనం

మలయ మారుత వింజామరలతో
సేద తీరుదాం
ఒక క్షణమైనా.. చాలు
మన కోసం... మనం
కాసేపైన జీవిద్దాం.

-ఎస్.ఎం.సుభాని

చేపులు నిండిపోయాయి. ఒక్కటే సలపరింపుగా ఉన్నాయి. కొద్దిసేపు ఓపికపట్టు" అంటూ రవిక ముడివిప్పి ఆ పసిపిల్ల నోట్లో తన స్తనాన్ని పెట్టింది. ఆకలి తెలిసిన పసికూన సుష్టుగా పాలు తాగింది. పొట్టలో పాలు పడగానే బిడ్డలో కొత్తదైన చైతన్యం పుట్టుకొచ్చింది. ఆనందంగా కేరింతలు కొట్టసాగింది.

బిడ్డకు కడుపు నిండింది. ఆ లావుపాటామెకు భారం దిగింది. ఆమెలోనూ ఉత్సాహం ఉరకలు వేసింది. తిరిగి బిడ్డను తల్లికి ఇస్తూ "నేను ఒక సినిమా స్టార్ దగ్గర పాలదాదిని. ఆమె బిడ్డడిని కని, వాడికి పాలిస్తే ఆమె అందం ఎక్కడ హరించుకుపోతుందోనని నాకు జీతమిచ్చి పెట్టుకుంది. నా బిడ్డ పురిట్లో పోబట్టి ఈ పనికి ఒప్పుకున్నాను. ఆమె కొడుక్కి జబ్బుచేసింది. ఆస్పత్రిలో ఉన్నాడు. డాక్టర్లు పాలు పట్టొద్దన్నారు. నా బాధ తెలిసిన ప్రొడక్షన్ మేనేజర్, 'ఇక్కడ ఓ బిడ్డతల్లి ఉందని' ఫోన్‌లో చెబితే నిన్ను వెతుక్కుంటూ వచ్చాను" అని అసలు విషయం చెప్పి తన పని ముగించుకుని తిరిగి వెళ్ళిపోయిందామె.

❖ ❖ ❖

లిపి చిల్డ్రన్ హాస్పిటల్ రోగులు, స్టాఫ్ ఉరుకులు, పరుగులతో చాలా హడావుడిగా కన్పిస్తోంది. కార్పొరేట్ ఆస్పత్రులలో ఉండే నిండుదనం అంతా అక్కడుంది.

## దివ్యసందేశం!

అంబరాన ఓ సుందర దృశ్యం
అందరూ వీక్షించె నక్షత్ర దర్శనం..!
మాతృగర్భాన ఉదయించె శిశువు జననం
అశరీరవాణి కీర్తించె ఏసుపునరుద్ధానం..!
పశువుల పాకలో దంపతులకు పుత్రోదయం
క్రీస్తు జననం వారి పూర్వజన్మ సుకృతం..!
పురజనులకు అపురూపం ఆ ప్రభువు దర్శనం
భక్తుల ఆనందపారవశ్యం అనిర్వచనీయం..!
పాపులను క్షమించే గుణం ప్రభువు కృపా విశేషం
పవిత్ర గ్రంథ నిర్వచనాలు నిత్య పఠనీయం..!
బాల ఏసు భజనలు భక్తులకు శ్రవణానందకరం
రుగ్మతలను నివారించే ఓ దివ్య గుణ ఔషధం..!
కఠినాత్ములను కనికరించే కరుణామయుడు
దీనజనులను కటాక్షించే దయా స్వరూపుడు..!
ప్రభువు జననం మమతానురాగాలకు నిలయం
వసుధైక జీవన గమ్యం ఆయన పథ నిర్దేశం..!
ప్రభువునందు విశ్వాసం మన ప్రథమ కర్తవ్యం
అభయప్రదాతగా అనుగ్రహించె దివ్యరూప దర్శనం..!
క్రిస్మస్ పర్వదినం మానవాళికి శ్రేయోదాయకం
ప్రతిధ్వనించె పృథ్విలో ప్రభువు 'దివ్య సందేశం'..!!

**-తంగెళ్ల పాండురంగ శర్మ**

ఖరీదైన కారులోంచి దిగింది ఫిల్మ్‌స్టార్ వందన. జనం ఆమెను గుర్తించి చుట్టుముట్టబోతే సెక్యూరిటీ వాళ్ళు వారిని దూరంగా తరిమేశారు. ఆమె సరాసరి డాక్టర్ రూపిణి కన్సల్టేషన్ రూమ్‌లోకి వెళ్ళింది. పక్కన బాడీగార్డ్ కమ్ పాలదాది జలజ కూడా ఉంది. నర్స్, కాంపౌండర్ వందనను లోనికి ఆహ్వానించి సీటు చూపిస్తూ "కూర్చోండి మేడం! డాక్టర్ రౌండ్స్ పూర్తయి ఐ.సి.యు.కి వెళ్ళారు. మీ బాబు అక్కడే ఉన్నాడుగా, చూస్తున్నారు" అని చెప్పారు.

"ఇప్పుడు బాబు కండిషన్ ఎలా ఉంది" అడిగింది వందన కాంపౌండర్‌ని.

"అమ్మగారొచ్చారని మీ డాక్టరమ్మకి చెప్పవయ్యా. కండీషనెలాగుందో ఆవిడే చెబుతుంది" అంది జలజ.

కాంపౌండర్ అక్కణ్ణుంచి పరిగెత్తుకుంటూ వెళ్ళి పోయాడు.

"జలజా! మనమే డైరెక్టుగా ఆ ఐ.సి.యు.కి వెళ్తే పోలే! కండిషన్ తెలుస్తుంది. బాబుని చూసినట్టుగానూ ఉంటుంది" అంది వందన.

వరండాలో నడుస్తుండగా ఆమెను గుర్తుపట్టిన వాళ్ళు "ఆమే ఫిల్మ్‌స్టార్ వందన" అని చెవులు కొరుక్కుంటున్నారు.

డాక్టర్ రూపిణి వారికి ఎదురైంది.

"డాక్టర్! ఎలాగుంది నా బాబుకి" అంటూ ఆతృతగా అడిగింది వందన.

"నాట్ బ్యాడ్. అయినా తగ్గడానికి కొన్ని రోజులు పడుతుంది. ఎలాగూ వచ్చారుగా, లోపలికెళ్ళి చూసి నా రూమ్‌కి రండి" అంది.

పదినిమిషాలు బాబు దగ్గర గడిపి డాక్టర్ రూమ్‌కి వచ్చారు వందన, జలజ.

"డాక్టర్! ఈ షూటింగుల వత్తిడిలో పడి నేను నా బిడ్డను సరిగా చూసుకోలేకపోతున్నాను. ఈమె నా బిడ్డకు పాలిచ్చే పాలదాయి" అంటూ జలజను పరిచయం చేసింది.

జలజ డాక్టర్ రూపిణికి నమస్కరించింది.

"వందనగారూ! మీకు కొన్ని నిజాలను చెప్పాలనిపిస్తోంది. అదైనా మీరు వాటిని సావధానంగా వింటానంటేనే! ముఖ్యంగా మీలాంటి వారూ, ఉద్యోగస్తులూ కూడా పిల్లలకి పాలివ్వడం మానుకుంటున్నారు. ఈ పరిస్థితి చూస్తే నాకు నవ్వాలో, ఏడవాలో తెలీకుండా ఉంది. ఎందుకంటే పిల్లలకు మీరు పాలివ్వడం వల్ల స్తనాల కేన్సర్, అండాశయ కేన్సర్ వంటివి రాకుండా

ఉంటాయి. అదీగాక తల్లిపాలు బిడ్డలకు ఇవ్వడంవల్ల వారికి విరోచనాలు, న్యుమోనియా, చెవిలో చీము, అలర్జీ, మధుమేహం వంటి రోగాలు రాకుండా ఉంటాయి. మీ విషయంలో నాకు అనిపిస్తున్నది ఒక్కటే. అది మీ అపోహ కావచ్చు. బిడ్డకు పాలివ్వడం వల్ల మీ అందం తరిగిపోతుందనేది కేవలం మీ భ్రమే. మీలాగే సగం మంది తల్లులు బిడ్డలకు పాలివ్వకుండా కృత్రిమ ఆహారం ఇచ్చి నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇదంతా మీకు తెలియందేమీ కాదు. చెప్పడం నా విధి" అంటూ టేబుల్ మీదున్న గ్లాసులోని మంచినీళ్ళు తాగింది రూపిణి.

చేతిలో సెల్ మోగడంతో వందన 'ఎక్స్క్యూజ్‌మీ' అని దూరంగా వెళ్ళింది. "ఆ! ఎవరూ? పి.ఎ. నువ్వా! మాట్లాడుతున్నానని చెప్తున్నానా! అర్జెంటైతే బయల్దేరి వస్తాను, ఫంక్షన్ రేపు పెట్టుకోమని చెప్పు. అబ్బా ఇవాళ కుదరదనేగా చెబ్తాంట. నేనిప్పుడు ఓ ముఖ్యమైన వ్యక్తితో ఇంపార్టెంట్ టాపిక్ డీల్ చేస్తున్నాను. ఏంటా రెండోది చెప్పి తగలడు. ఎల్లుండి నుంచి స్విట్జర్లాండ్‌లో షూటింగా... పదిరోజులు వరస కాల్షీట్లా! డబ్బు ఎక్కువ డిమాండ్ చెయ్యి. ఒప్పుకుంటే డేట్లు ఇచ్చేయ్! ఆ పెట్టేస్తున్నా!" అని దాన్ని ఆఫ్ చేసింది.

తిరిగొచ్చి డాక్టర్‌కి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది.

"డాక్టర్! నా బిడ్డను మీ చేతుల్లో పెడుతున్నా! తొందరగా వాడు రికవరీ అయ్యేట్టు చూడండి. మా అమ్మ బాబు దగ్గరే ఉంటుంది" అంది కుర్చీలోంచి లేస్తూ వందన.

❖ ❖ ❖

జలజ మాత్రం రోజూ ఆ ముష్టితల్లీ, బిడ్డలను వెతుక్కుంటూ వెళ్ళడం, పాలు ఇచ్చిరావడం జరుగుతోంది.

❖ ❖ ❖

వందన ప్రవాసం వెళ్లిన కొద్దిరోజులకే ఆమె బాబు చనిపోయాడు. అంత్యక్రియలు వందన తల్లిదండ్రులు నిర్వహించారు. ఆ విషయం ప్రొడక్షన్ వాళ్ళు ఆమెకు తెలియకుండా జాగ్రత్తపడ్డారు. ఇండియా రాగానే విషయం తెలిసి వందన కుమిలిపోయింది. ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు, సాటి నటీనటులు, టెక్నీషియన్స్ వచ్చి ఎన్నో ఓదార్పు మాటలు చెప్పి పరామర్శించసాగారు.

"స్విట్జర్లాండ్ వెళ్ళకుండా ఉండి ఉంటే బాబు చివరి చూపులయినా దక్కేవి. సంపాదనలో పడి మాతృత్వాన్ని మరచినందుకు తగిన శాస్తీ జరిగింది" అని విలపించింది. వారం రోజులపాటు ఎటువంటి షూటింగ్‌లలో పాల్గొనకుండా ఇంటిపట్టునే ఉండిపోయింది వందన.

వందన కాల్షీట్లు చూసే పి.ఎ., "అమ్మా! ఆ చౌదరి గారి సిన్మా షూటింగ్ ఎల్లుండి నుంచి ప్రారంభం. మనం ఆయన దగ్గర ముందుగానే ఏభైవేలు అడ్వాన్సు తీసుకున్నాం! అగ్రిమెంటు మీద మీరు సంతకం కూడా పెట్టారు. దానికి అటెండ్ కాకపోతే ఆయన కోర్టుకు పోతాడు. అసలే తిరకాసుమనిషి. వైజాగ్‌లో పదిరోజులు షూటింగ్. ఏం చెప్పమంటారు" అంటూ నసిగాడు.

ఒక్కనిమిషం మౌనంగా ఉండి, "టిక్కెట్లు బుక్ చేయమని చెప్పు" అంది వందన.

అదే విషయం అవతలి వ్యక్తికి ఆనందంగా చెప్పాడు పి.ఎ.

విశాఖపట్నం వెళ్ళే ముందురోజు గుడికి బయలుదేరింది వందన. అక్కడ ముష్టితల్లి బిడ్డకు పాలిస్తూ కన్పించింది జలజ. వందన వంటిమీద తేళ్ళు, జెర్రులూ పాకినట్లైంది. దగ్గరకు వెళ్ళి తీవ్ర స్వరంతో "జలజా ఛీ! ఛీ! ఇటువంటి ముష్టివాళ్ళ పిల్లలకు పాలివ్వడానికి నీకు బుద్ధిలేదా! ఇలా చేసే నా బిడ్డను పొట్టనపెట్టుకున్నావా? శుచి శుభ్రం, ఉచ్ఛనీచాలు తెలియని నీలాంటిదాన్ని నమ్ముకుని నేను పొరపాటు చేశాను" అంటూ ఎగిరెగిరి పడింది.

జలజకు తిక్కరేగింది. ఎంత అణచుకున్నా కోపం ఆగక పెదవి దాటింది. "అమ్మా! రోడ్డు మీద గొడవ పెట్టబాకు. నేను నీలా బజార్లలో షూటింగుల పేరుతో గంతులెయ్యలేదు. ఎదవ తిరుగుళ్ళు తిరగలేదు. అందం తగ్గుతుందని కన్న బిడ్డకు పాలివ్వకుండా ఉండలేదు. బిడ్డ ఎవరయినా బిడ్డే. పసివారికి ఆకలి తెలుసు. నీ బిడ్డ పోయినంత మాత్రాన చేపే పాలు ఒక్కసారిగా ఆగిపోతాయా? నా చనుభారం తీర్చుకుంటూ, ఓ బిడ్డ ఆకలి తీరుస్తున్నా! ఈ బిడ్డకూ నీ బిడ్డకుమల్లే పాలిచ్చే తల్లిని. నాకు పాలివ్వడమే తెలుసు గానీ పొట్టనపెట్టుకోవడం తెలియదు. నేను నీలాంటి కుసంస్కారం గలదాన్ని కాదు. వందనా! నీ ఉద్యోగానికి ఓ వందనం. కూటికి లేకుంటే పస్తులుంటాను. కాని ప్రతీదీ వ్యాపారంలా చూసే నీలాంటి వ్యక్తి దగ్గర పనిచెయ్యలేను" అంది.

తనదగ్గర అణిగి మణిగి ఉన్న జలజేనా! ఎన్ని మాటలు నేర్చింది. హు! అంటూ కారెక్కి వెళ్ళిపోయింది వందన. ■